కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలి

కృష్ణారెడ్డి, ఆత్మకమిటీ మాజీ చైర్మన్

గజ్వేల్, ఏప్రిల్ 25 : రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయలేని కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారని గజ్వేల్ డివిజన్ ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఉడేం కృష్ణారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం ఎప్పుడూ రైతు సంక్షేమ కోసం పనిచేసిందని, ప్రాజెక్టుల నిర్మాణంతో ఆత్మ హత్యలు లేని తెలంగాణగా మార్చిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. రైతులను ప్రభుత్వం పట్టించుకొకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నరని వెంటనే వారికి న్యాయం చేసే దిశగా ఆలోచించాలన్నారు.

బకాయిపడిన వేతనాలు విడుదల చేయాలి

గజ్వేల్, ఏప్రిల్ 25 : జిల్లాలో గత నాలుగు నెలలకు పైబడి బకాయిపడిన గ్రామ పంచాయతీ కార్మికుల జీతాలను వెంటనే చెల్లించాలని లేకపోతే ఆకస్మిక సమ్మెకు దిగుతామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సంద బోయిన ఎల్లయ్య హెచ్చరించారు. ఈసందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికుల్లో 99శాతం వరకు దళిత కుటుంబాలకు చెందిన వాళ్లే ఉన్నరని, ఇన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో వారికి కుటుంబ పోషణ భారంగా మారుతుందన్నారు. ప్రభుత్వం వెంటనే బకాయిపడ్డ జీతాలను చెల్లించాలన్నారు.

నేటి నుంచి మహంకాళి విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలు

మిరుదొడ్డి, ఏప్రిల్ 25 : మిరుదొడ్డి మండల పరిధిలోని ధర్మారం గ్రామంలో ఈ నెల 26వ తేదీ నుంచి 29 వరకు మహంకాళి అమ్మవారి విగ్రహప్రతిష్ఠాపన ఉత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించనున్నారు. 26న యాగశాల ప్రవేశం, స్వస్తివచనం, 27న ఆవాహిత దేవతా పూజ, హారతి, 28న యంత్ర విగ్రహప్రతిష్ఠ, పోచమ్మదేవి అమ్మవారికి బోనాలు, 29న మహంకాళి అమ్మవారికి బోనాలు తీయుట కార్యక్రమాలను ఘనంగా నిర్వహించనున్నారు.

జనజాగృతి కళాసమితి సభ్యుల నియామకం

హుస్నాబాద్‌టౌన్, ఏప్రిల్ 25 : జనజాగృతి కళాసమితి అంతర్భాగమైన కవిసాయంత్రం సలహామండలి సభ్యులను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ముక్కెర సంపత్ ఒక ప్రకటనలో తెలిపారు. సలహామండలి సభ్యులు పెద్దపల్లి అదనపు కలెక్టర్ గాజుల శ్యాంప్రసాద్‌లాల్, సినీగేయ రచయిత మల్లిక్, సీనియర్ న్యాయవాది గులాబీల మల్లారెడ్డి, జైలుశాఖ డీఎస్పీ దార్ల కాళిదాస్, జర్నలిస్టు బోయిని భాస్కర్, రిటైర్డ్ ఉద్యోగి రాములును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు.

మెదక్‌కు తరలిన బీఆర్ఎస్ నాయకులు

వర్గల్/గజ్వేల్,ఏప్రిల్ 25: బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థిగా గురువారం వెంకట్రామిరెడ్డి నామినేషన్ వేయడంతో వర్గల్ మండలం నుంచి ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు వేర్వేరుగా తరలివెళ్లారు. బీసీసెల్ నాయకులు పడిగెరాజు,మల్లెల జహంగీర్‌యాదవ్, తుమ్మగణేశ్,చాంద్‌పాషా ఉన్నారు.

రేపు నెంటూర్‌లో పెద్దమ్మ కల్యాణం

వర్గల్, ఏప్రిల్ 25 : మండలంలోని నెంటూర్‌లో జరుగుతున్న పెద్దమ్మతల్లి వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా శనివారం పెద్ద మ్మ కల్యాణం నిర్వహించనున్నట్లు గ్రామముదిరాజ్ సంఘం ప్రతినిధులు తెలిపారు. భక్తులకు అన్నదానంతో పాటు, తాగునీటిసౌకర్యం, చలువ పందిళ్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

సీపీఎం ఇంటింటా ప్రచారం

చేర్యాల, ఏప్రిల్ 25 : కొర్పొరేట్ల కొమ్ము కాస్తున్న మోదీ ప్రభుత్వాన్ని గద్దెదించడమే లక్ష్యంగా సీపీఎం శ్రేణులు ముందుకు సాగుతున్నాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కె. గోపాలస్వామి, మండల కార్యదర్శి కొంగరి వెంకట్‌మావో తెలిపారు. పట్టణంతో పాటు మండలంలోని ముస్త్యాలలో గురువారం సీపీఎం భువనగిరి అభ్యర్థి జహంగీర్‌కు మద్దతుగా ఇంటింటా ప్రచారం చేశారు. నాయకులు రాళ్లబండి నాగరాజు, ముస్త్యాల ప్రభాకర్, బోయిని మల్లేశం, ప్రవీణ్, సాగర్, రేపాక కుమార్, గుండ్ర రవి, కొంగరి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు పట్టం కట్టండి

కొమురవెల్లి, ఏప్రిల్ 25 : ఎల్లప్పుడూ ప్రజల్లో ఉంటూ ప్రజా సేవకు కట్టుబడి ఉండే సీపీఎం భువనగిరి ఎంపీ అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి కోరారు. గురువారం మండలంలోని పోసాన్‌పల్లిలో సీపీఎం పార్టీకి ఓటు వేయాలని ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో తాడూరి రవీందర్, బక్కెల్లి బాలకిషన్, సత్తయ్య, పూస మల్లేశం, పుట్ట బాబు, పిట్టల కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

భువనగిరికి తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

చేర్యాల నుంచి తరలిన నాయకులు

మద్దూరు నుంచి తరలిన నాయకులు

కొమురవెల్లి నుంచి తరలిన నాయకులు

చేర్యాల, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్ అధినేత చేపట్టిన బస్సు యాత్రతో అధికార పక్షానికి వణుకు మొదలైందని బీఆర్ఎస్ మండలాధ్యక్షులు మేక సంతోశ్, మందయాదగిరి, అనంతుల మల్లేశం, ముస్త్యాల నాగేశ్వర్‌రావు, కొమురవెల్లి జడ్పీటీసీ సిలువేరు సిద్ధప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి శ్రీధర్‌రెడ్డి, ఎంపీపీ బద్దిపడిగె కృష్ణారెడ్డి అన్నారు. గురువారం భువనగిరిలో నిర్వహించిన బీఆర్ఎస్ అధినేత బస్సుయాత్ర, రోడ్ షోకు చేర్యాల,కొమురవెల్లి, మద్దూరు, ధూళిమిట్ట మండలాల నుంచి వందలాది వాహనాల్లో పార్టీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు,కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు.

ఎన్నికలు సజావుగా జరిగేందుకు

ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

అడిషనల్ కలెక్టర్, దుబ్బాక ఏఆర్వో గరీమా అగర్వాల్

అధికారులకు సూచనలిస్తున్న దుబ్బాక నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గరీమా అగర్వాల్

దుబ్బాక, ఏప్రిల్25: లోకసభ ఎన్నికలు సజావుగా జరిగేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ , దుబ్బాక నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి గరీమా అగర్వాల్ సూచించారు. ఎంపీ ఎన్నికల సందర్భంగా గురువారం దుబ్బాక ఐవోసీ కార్యాలయంలో ఎన్నికల సిబ్బందికి ఈవీఎం కమీషనింగ్‌పై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో ఓటరులకు ఇబ్బందులు తలెత్తకుండా, ప్రశాంతంగా ఓటింగ్ జరిగేందుకు అధికారులు, బీఎల్‌వోలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దుబ్బాక, మిరుదొడ్డి , భూంపల్లి, రాయపోల్, తొగుట తహసీల్దార్లు వెంకట్‌రెడ్డి, జయంత్, జ్ఞానజ్యోతి, దివ్య, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎం కమీషనింగ్ శిక్షణలో ఎన్నికల అధికారులు

కేసీఆర్, హరీశ్ రావు కృషితోనే సిద్దిపేటకు రైలు

రఘునందన్ వ్యాఖ్యలను ఖండించిన బీఆర్ఎస్ నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకులు

సిద్దిపేట, ఏప్రిల్ 25 : ప్రాజెక్టులో భూములు కోల్పోయిన భూ నిర్వాసితులకు మెరుగైన పరిహారం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ అందించారని మున్సిపల్ మాజీ చైర్మన్ కడవేర్గు రాజనర్సు అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని భారత్ నగర్‌లో గల ఎమ్మెల్యే హరీశ్ రావు నివాసంలో బీఆర్ఎస్ నాయకులు పాలసాయిరాం, లోక లక్ష్మీరాజ్యం, భూపేశ్, నముండ్ల రామచంద్రం, ఎర్ర యాదయ్యలతో కలిసి మాట్లాడారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో భూ నిర్వాసితులకు ఎకరాకు రూ. 1,20,000 ఇస్తే కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఎకరాకు రూ.6.30 లక్షలు ఇచ్చారన్నారు. సింగూరు భూ నిర్వాసితులకు భూ పరిహారం అందించామన్నారు. రఘునందన్ రావు నిజాలు తెలుసుకొని మాట్లాడాలని సూచించారు. మల్లన్నసాగర్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరాకు రూపాయలు 6:30 లక్షలు ఇచ్చామన్నారు. వెంకట్రామిరెడ్డి కలెక్టర్‌గా ప్రభుత్వ ఆదేశాలను, విధానాలను అమలు చేశారని ఏ కలెక్టర్ ఉన్నా అదే పని చేస్తారని అన్నారు. భూ నిర్వాసితులకు వెంకట్రామిరెడ్డి అన్యా యం చేశాడనిరఘునందన్ రావు మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. సిద్దిపేటకు రైలు కావాలన్నది ఇక్కడి ప్రజల 40 ఏండ్ల కలను నెరవేర్చింది కేసీఆర్, హరీశ్‌రావు అన్నారు. మనోహరాబాద్ కొత్తపల్లి రైల్వే లైన్ నిర్మాణానికి యూపీఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా కేసీఆర్ ప్రతిపాదనలు చేసి పంపారన్నారు. రైల్వేలైన్ నిర్మాణానికి భూసేకరణతో పాటు రు. 800 కోట్లు రాష్ట్ర ప్రభు త్వం చెల్లించిందన్నారు.

తప్పుడు హామీలు ఇవ్వడం వల్లనే మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు రఘునందన్ రావుకు కర్రు కాల్చి వాతపెట్టారన్నారు. నాయకులు ముత్యాల కనకయ్య, బెల్లరాములు, నిమ్మ శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాలొన్నారు.

కాంగ్రెస్.. నయవంచనకు మారుపేరు

మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు

మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

సిద్దిపేట, ఏప్రిల్ 25 : అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల కోసం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేస్తానని ఐదు నెలలు గడుస్తున్నా రుణమాఫీ చేయకపోవడం కాంగ్రెస్ నయవంచనకు నిదర్శనమని మెదక్ బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్ రావు అన్నారు. గురువారం సిద్దిపేట పట్టణంలోని డిగ్రీ కళాశాల మైదానంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా సిద్దిపేట విశాల జనసభలో ఆయన మాట్లాడారు.

అమిత్ షా ప్రసంగ సమయంలో సభలో పలుచబడిన జనం

కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సిద్దిపేట బీజేపీ విశాల జనసభలో ప్రసంగిస్తున్న సమయంలో బహిరంగ సభ ప్రాంగణంలో ప్రజలు వెళ్లిపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. అమిత్ షా సమయం మధ్యాహ్నం 1 :56 నిమిషాలకు సభ వేదికపై చేరుకొని తన ప్రసంగాన్ని ప్రారంభించి రెండు ఐదు నిమిషాలకు ముగించారు. భారీగా జనం తరలి వస్తారని బీజేపీ శ్రేణులు భావించినప్పటికీ అమిత్ షా రావడం లేట్ కావడంతో అప్పటికే చాలామందికి బయటకు వెళ్లారు.

సహారా డబ్బులు చెల్లించాలంటూ ప్లకార్డుల ప్రదర్శన

అమిత్ షా ప్రసంగిస్తున్న సమయంలో సహారా ఇండియా కంపెనీలో పొదుపులు చేసిన వ్యక్తులు దాదాపు పది నుంచి 12 మంది ప్లకార్డులను ప్రదర్శించారు. తమకు వెంటనే సహార ఇండియా డబ్బులు చెల్లించాలని కోరారు. మాకు డబ్బులు ఎవరు చెల్లిస్తారో చెప్పాలంటూ నినాదాలు చేయడంతో బీజేపీ నేతలు మోదీ జిందాబాద్ అంటూ నినాదాలు చేశారు. సహరా ఇండియా కంపెనీలో 2022 నుంచి తాము పెట్టిన డబ్బులు చెల్లించాలని కోరారు.

మొక్కజొన్న పంట దగ్ధం

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 25 : అగ్ని ప్రమాదంలో చేతికొచ్చిన మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటన మండలంలోని అలిరాజ్‌పేట గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పెద్దోళ్ల ప్రభాకర్‌రెడ్డి,తండ్రి నర్సింహారెడ్డి ఎకరం భూమిలో మొక్కజొన్న పంట వేయగా, గుర్తు తెలియని వ్యక్తులు పంటకు నిప్పు పెట్టడంతో గాలి తాకిడికి మంటలు ఎగిసిపడి పంట బూడిదయ్యిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట కాలిపోవడంతో లక్షరూపాయల వరకు నష్టం వాటిల్లిందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు కోరారు.

మలేరియా రహిత సమాజాన్ని నిర్మిద్దాం

డీఎంహెచ్‌వో పుట్ల శ్రీనివాస్

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్

సిద్దిపేట, ఏప్రిల్ 25 : మలేరియా నిర్మూలన ధ్యేయంగా పనిచేద్దామని డీఎంహెచ్‌వో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. సిద్దిపేట పట్టణంలోని నాసర్పుర అర్బన్ హెల్త్ కేర్ సెంటర్‌లో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ప్రతి ఒక్కరూ వ్యాధిపై అవగాహన కలి గి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రవీణ్, పీహెచ్‌సీ వైద్యులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పట్టణంలోని మోహిన్‌పుర బస్తీ దవాఖానను సందర్శించి అక్కడ ప్రజలకు అందుతున్న వైద్య సేవలను అడిగి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు.

గజ్వేల్‌లో మలేరియాపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

దోమలను అరికట్టి.. ఆరోగ్య సమాజాన్ని నిర్మించాలి

గజ్వేల్, ఏప్రిల్ 25: దోమలను అరికట్టి ఆరోగ్య సమాజ నిర్మాణంలో అన్ని వర్గాల వారు పాలుపంచుకోవాలని అప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుందని గజ్వేల్ సబ్ యూనిట్ అధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం గజ్వేల్ దవాఖానలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు రాకేశ్, సంధ్య, అరుణ, హెల్త్ అసిస్టెంట్ వాసుదేవ్, సిబ్బంది పాల్గొన్నారు.

అహ్మదీపూర్‌లో..

మండల పరిధిలోని అహ్మదీపూర్‌లో పీహెచ్‌సీ సిబ్బంది ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గ్రామంలో నిర్వహించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రణయ్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

నిర్మలా రాణికి సన్మానం

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 25 : పీపుల్స్ ఫోరం ఆఫ్ ఇండియా రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శిగా నియామకమైన నిర్మలా రాణిని సిద్దిపేట లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ అమర్నాథ్ రావు, ప్రతినిధులు జ్యోతి, ఈశ్వరయ్య, శేఖరం, వైకుంఠం, జోగయ్య, నారాయణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

గజ్వేల్, ఏప్రిల్ 25 : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలపరిధిలోని రిమ్మనగూడ రాజీవ్‌రహదారిపై గురువారం చోటుచేసుకుంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. దాతర్‌పల్లి గ్రామానికి చెందిన కంటె బాలయ్య(60) టీవీఎస్ ఎక్సల్‌పై ప్రజ్ఞాపూర్ వెళ్తుండగా కారు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు, అతడి భార్యకు గాయాలైనట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ మృతదేహం లభ్యం

గజ్వేల్ ఏప్రిల్25 : గజ్వేల్ మున్సిపల్ పరిధిలోని ప్రజ్ఞాపూర్ ఇండియన్ గ్యాస్ గోదాం సమీపంలో గురువారం గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. సీఐ సైదా తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 35 నుంచి 40 ఏండ్ల గుర్తు తెలియని మహిళ మూడు నుంచి నాలుగు రోజుల కింద మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో గుర్తు పట్టలేని స్థితిలో ఉంది. ఈమేరకు మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వ దవాఖానలో భద్రపరిచామని, కేసు నమోదు చేసి దర్యాప్తుచేస్తున్నట్లు తెలిపారు.

అభ్యర్థులు కష్టపడి చదవాలి

సిద్దిపేట టౌన్,ఏప్రిల్ 25 : పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు కష్టపడి చదివి ఉద్యోగాలను సాధించాలని బీఎన్‌రావు ఫౌండేషన్ చైర్మన్ బీఎన్ రావు అన్నారు. సిద్దిపేట ఎస్సీ స్టడీ సర్కిల్ అభ్యర్థులకు గురువారం జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఉస్మానియా యూనివర్సిటీ ప్రిన్సిపాల్ డాక్టర్ రవినాథ్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ డాక్టర్ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

వైభవంగా రాజరాజేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన

పూజలు చేస్తున్న వేదపండితులు

చేర్యాల, ఏప్రిల్ 25 : మండలంలోని ఆకునూరులో శ్రీ రాజరాజేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం రెండు రోజులుగా ప్రత్యేక పూజలతో అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగాకొనసాగుతున్నది. గురువారం స్థాపిత దేవతాపూజలు, మూలమంత్ర అనుష్ఠానములు, హోమం, శయ్యాధి, ధాన్యాధి, ఫల, పుష్ప అధివాసములు, ప్రదోషకాల పూజలు, నామ సంకీర్తన తదితర పూజలను వేదపండితులు నిర్వహించారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న పూజలకు గ్రామస్తులతో పాటు పరిసర గ్రామాల భక్తులు తరలివచ్చారు. కార్యక్రమాల్లో దేవాలయ కమిటీ అధ్యక్షుడు కరెడ్ల రాజేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు వంగాల శ్రీకాంత్‌రెడ్డి, జూపల్లి బాపురెడ్డి, కర్రె శ్రీనివాస్‌రెడ్డి, పెంటపర్తి రాజిరెడ్డి, కాపర్తి సిద్ధేశ్వర్,రోహిత్‌శర్మ, జూపల్లి కార్తీక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లద్నూర్‌లో బొడ్రాయికి జలాభిషేకం

బొడ్రాయికి జలాభిషేకం చేస్తున్న మహిళలు

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 25 : మద్దూరు మండలంలోని లద్నూర్‌లో బొడ్రాయి ప్రతిష్ఠాపన ఉత్సవంలో భాగంగా గురువారం భూలక్ష్మి, మహాలక్ష్మి విగ్రహాలతో పాటు బొడ్రాయి విగ్రహానికి మహిళలు జలాభిషేకం చేశారు. డప్పుసప్పుళ్ల మధ్య ఊరేగింపుగా మహిళలు రాగిబిందెల్లో నీళ్లు తీసుకవచ్చి బొడ్రాయికి సామూహికంగా జలాభిషేకాన్ని నిర్వహించారు. అర్చకులు చండీయాగాన్ని శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ కార్యక్రమంలో బొడ్రాయి ఉత్సవ కమిటీ అధ్యక్షుడు ఇర్రి రాజిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు పుట్ట వెంకటరమణారెడ్డి, ఎంపీటీసీ గుజ్జుక సమ్మయ్య, మాజీ సర్పంచ్‌లు జీడికంటి సుదర్శన్, జీడికంటి సరేశ్, పాలకేంద్రం చైర్మన్ రాపాక బుచ్చిరెడ్డి, నాయకులు దాసరి పద్మారెడ్డి, దండు సోమన్న, సోగాల మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నరసింహుడి రథోత్సవం

బెజ్జంకి మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ముఖ్య ఘట్టమైన రథోత్సవం కనుల పండువగా జరిగింది. రథోత్సవాన్ని తిలకించడానికి మండలం నుంచి కాకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడంతో పరిసర ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి.-బెజ్జంకి, ఏప్రిల్ 25

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నర్సాయపల్లిలో ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న డీఆర్డీవో జయదేవ్

మద్దూరు(ధూళిమిట్ట), ఏప్రిల్ 25 : ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీఆర్డీవో జయదేవ్ అన్నారు. గురువారం మద్దూరు మండలంలోని నర్సాయపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్డీవో సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలన్నారు. అనంతరం గ్రామంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులు, హరిత నర్సరీని డీఆర్డీవో పరిశీలించారు. ఎండలు అధికంగా ఉన్న కారణంగా ఉదయం వేళల్లో కూలీలతో పనులు చేయించి, కొలతలు వేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట ఎం పీడీవో రామ్మోహన్, ఎంపీవో ఖాజా మోహినుద్దీన్, ఏపీఎం బాబురావు, సీసీ సిద్ది మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

29న 'భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సు'

హుస్నాబాద్, ఏప్రిల్ 25: హుస్నాబాద్ నియోజకవర్గ జేఏసీ ఆధ్వర్యంలో ఈ నెల 29న భారత రాజ్యాంగ పరిరక్షణ సదస్సు నిర్వహిస్తున్నట్లు జేఏసీ కో-కన్వీనర్ మేకల వీరన్నయాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదురుగా బీఎల్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉ. 10 గంటలకు సదస్సు ప్రారంభమవుతుందని, పదేండ్లు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ వైఫల్యాలు, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం భవిష్యత్‌లో అనుసరించబోయే విధానాలపై సమగ్రచర్చ ఉంటుందని పేర్కొన్నారు.

కార్యకర్తలకు బీఆర్ఎస్ అండ..

ఆర్థిక సాయం అందిస్తున్న దౌల్తాబాద్ బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రహీమొద్దీన్

రాయపోల్, ఏప్రిల్ 25 : బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్టీ ఎళ్లప్పుడు అండగా ఉంటుందని దౌల్తాబాద్ మండలాధ్యక్షుడు పయ్యద్ రహీమొద్దీన్ అన్నారు. గురువారం దౌల్తాబాద్ మండలంలోని గోవిందాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నందగారి మహేందర్ తండ్రి నర్సింహులు ఇటీవల మృతి చెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట బీఆర్ఎస్ నియోజక వర్గ నాయకులు దారా సత్యనారాయణ, గ్రామ బీఆర్ఎస్ నాయకులు సాగర్‌రెడ్డి,చంద్రమౌళి, భూపాల్, దాస్, చిన్నా, మల్లేశం తదితరులు ఉన్నారు.

తనిఖీల్లో నగదు పట్టివేత

తొగుట, ఏప్రిల్ 25 : డబ్బులు తీసుకువెళ్లేటప్పుడు సరైన పత్రాలు వెంట ఉండాలని తొగుట సీఐ లతీఫ్ తెలిపారు. గురువారం సీసీఐ లతీఫ్,ఎస్సై లింగం సిబ్బందితో కలిసి తుక్కాపూర్ గ్రామ శివారులో వాహనాల తనిఖీ నిర్వహించారు. బండారుపల్లి గ్రామానికి చెందిన. సాయిబాబా హోండా యాక్టివ్‌లో రూ.80వేలు తీసుకుని వెళ్తుండగా పట్టుకున్నామన్నారు. ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో వాటిని సీజ్ చేశామని తెలిపారు.